ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 14 | జూలై | 2024
పేజీలు 6

## నూతన చట్టాలపై నేడు సెమినార్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** నూతన చట్టాలు సమాజం పై ప్రభావం అనే అంశం పై ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సెమినార్ నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నేడొక ప్రకటనలో తెలిపారు. బిజెపి తీసుకు వచ్చిన మూడు నూతన న్యాయ చట్టాలు ప్రజలకు ఇబ్బందికరంగా మారడంతో పాటు స్వేచ్ఛను హరించేవిధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ చట్టాలపై అవగాహన కలిగించేందుకు సెమినార్ నిర్వహిస్తున్నామని ఈ సెమినార్‌కు ముఖ్య వక్తగా సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి హాజరు కానున్నారని ప్రసాద్ తెలిపారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తదితరులు పాల్గొంటారని ప్రసాద్ తెలిపారు.



# విద్యారంగంలో దెబ్బతిన్న సమతుల్యత

## డాక్టర్, ఇంజనీరింగ్ చదువుల వైపు పరుగులు

- వెలవెలబోతున్న డిగ్రీ కళాశాలలు
- ఇతర విద్యా కోర్సులకు ఆదరణ కరువు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రకృతి సమతుల్యత మాదిరే విద్యా రంగంలోను సమతుల్యత అవసరం. కాని విద్యార్థుల కంటే విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచనలో వచ్చిన మార్పు విద్యారంగ సమతుల్యతను దెబ్బతీస్తుంది. చదువంటే కేవలం సాంకేతిక విద్యను అభ్యసించడమేనన్న ఒక భావన తల్లిదండ్రుల్లో బలంగా నాటుకుపోయింది. గత పదేళ్ల నుంచి తమ కొడుకు ఇంజనీర్ కావాలి లేదంటే డాక్టర్ కావాలి అనే ఆలోచన తప్ప మరోవిధంగా ఆలోచించడం లేదు. బాల్యపు గుర్తులు పోక ముందే వివిధ పేర్లతో వెలిసిన విద్యాలయాల్లో పెట్టి ఐఐటి, నీట్, ఇలా రకరకాల కోర్సులతో వాళ్ల మెదళ్లను తొలి చేస్తున్నారు. గతంలో ఆరు సబ్జెక్టులను ప్రాథమిక విద్యతో ప్రారంభమై బోధన సాగేది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించే వారు. పది తర్వాత విద్యార్థి ఎంచుకునే గ్రూపులను బట్టి విద్యా బోధన ఉండేది. ఇంగ్లీష్‌ను తప్పనిసరి చేస్తూ రెండవ

మిగతా 2లో..

## ఖమ్మం కీర్తి పెరిగేలా అభివృద్ధి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేలా మరింతగా నగర సమగ్రాభివృద్ధి జరగాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరం అందంగా, పరిశుభ్రంగా, ఆదర్శంగా ఉండాలని ఆయన కోరారు. శనివారం నగర పాలక సంస్థ సభ్యులు, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, వైద్యం, మౌలిక వసతులతో పాటు ప్రశాంతత నెలకొనేవిధంగా ప్రజలకు భరోసా ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. నగరానికి భూ గర్భ,

-త్వరలో ఖమ్మం అభివృద్ధిపై ముఖ్యమంత్రితో చర్చ
-పారిశుధ్య పనులపై దృష్టి సారించండి
-కార్పోరేషన్ సమీక్షలో మంత్రి తుమ్మల

మురుగు కాలువల వ్యవస్థను సాధిస్తామని, మంచినీరు, రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తామని ఆయన తెలిపారు. ఖమ్మంలో చాలా కాలంగా ఇండ్లు

మిగతా 2లో..

## రీల్స్ చూస్తూ స్టాఫ్ నర్స్ నిర్లక్ష్యం..

# పురిటి బిడ్డ బలి

- తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హృదయ విదారక ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..
- ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు





**ప్రజాపక్షం/ తల్లాడ :** ఓ తల్లి నవ మాసాలు తన గర్భంలో పెంచుకున్న పసి బాలుడు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సరైన సమయంలో వైద్యం అందక బలయ్యాడు. పురిటి నొప్పులతో ఆస్పత్రికి చేరిన గర్భిణీకి డెలివరీ చేయాల్సిన వైద్యుడు, సిబ్బంది చేతులెత్తేయడంతో అభం శుభం తెలియని ముక్కు పచ్చలారని బాలుడు ఉమ్మనీరు

మిగతా 2లో..

# విద్యారంగంలో దెబ్బతిన్న సమతుల్యత

(మొదటిపేజీ తరువాయి)
భాషగా తెలుగు లేదా హిందీని ఎంచుకునే అవకాశం ఉండేది. కాని ఇప్పుడు కార్పొరేట్ మొదలు చాలా పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులను బోధించడం లేదు. ఒకట్రెండు నెలల్లో సబ్జెక్టులను బోధించి వదిలేసి గణితం, సామాన్యశాస్త్రం పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. దీని వల్ల విద్యార్థి లో సమతుల్యత దెబ్బతింటుంది. అన్నింటికి మించి నిరంతరం తరగతి గదుల్లో ఉండడం ద్వారా సమాజం పట్ల అవగాహన సన్నగిల్లుతుంది. డిగ్రీ పొందిన విద్యార్థి కూడా ఇప్పుడు సమాజంలో ఏమి జరుగుతుంది, సమాజం పట్ల కనీస అవగాహన లేని పరిస్థితి. గణితం, సైన్స్ తప్ప మరె రంగం గురించి వీరికి పరిచయం ఉండడం లేదు. ఇక ఇంటర్ లోను ఇదే పరిస్థితి. మొదటి రెండు నెలల్లో ఇతర అంశాలను పూర్తి చేసి ఇక ఇంజనీర్, డాక్టర్ అంటూ రుద్దడం మొదలు పెడుతున్నారు. చదువంటే ఇంజనీర్ కావడం, డాక్టర్ కావడమేనన్న భావన చాలా మందిలో బలపడింది. ఈ భావన ఎప్పుడైతే బలపడిందో అప్పుడే డిగ్రీ కళాశాలలు వెలవెలబోతున్నాయి. డిగ్రీ చదివే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. డిగ్రీ చదవకపోవడం వల్ల ఇంజనీర్, డాక్టర్ మినహా మిగిలిన ఉద్యోగాలకు అభ్యర్థులు కరువయ్యే పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్యతో పాటు ఇతర విద్యా సంస్థలను కూడా ప్రోత్సహించాల్సి ఉంది. అందరు ఇంజనీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ రంగం పై దృష్టి సారిస్తే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిణామాలు రేపు మరింత నష్టాన్ని చేకూర్చే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్ రంగంలోఉద్యోగాల కోత ఇప్పుడు యావత్ ప్రపంచాన్ని భయపెడుతుంది. ఇన్ని సంవత్సరాలు చదివి ఉద్యోగాలు చేసిన తర్వాత అవకాశం లేదు పొమ్మంటే ఏమి చేయాలో పాలుపోక చాలా మంది మానసిక ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పుడు వస్తున్న తరం కూడా ఇంజనీరింగ్ పై దృష్టి సారిస్తే ఇబ్బందులు ఎదుర్కొనక తప్పని పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఆలోచనలను ఎప్పటికప్పుడు ప్రోత్సహించాల్సి ఉంటుంది. పాలకులకు ముందు చూపు అవసరం. ఒక పదేళ్ల తర్వాత పరిస్థితి ఏమిటన్నది అంచనా వేయగలగాలి. పాలకులకు ముందు చూపు లేకుండా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న రీతిగా వ్యవహరిస్తే దాని ప్రభావం మొత్తం యువతరం పై పడుతుంది. దీంతో ఆర్థిక మాంద్యం ఏర్పడడంతో పాటు నిరుద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగి దేశ భవిష్యత్తు అంధకారం అవుతుంది. ప్రభుత్వ విద్యపై పాలకులకు అంతగా పట్టింపు లేదు. మోడల్ స్కూల్స్, గురుకులాలు అంటూ పరుగులు పెడుతున్నారే తప్ప ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ విద్య గాడి తప్పిందన్న వాస్తవాన్ని గుర్తెరగడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు గణనీయంగా పడిపోతుందన్న దానిపై ప్రభుత్వానికి సరైన ఆలోచన లేదు. ఇదే సమయంలో రకరకాల పేర్లతో పాఠశాలలు ఏర్పాటు చేసి లక్షల రూపాయలను ఫీజుల దోపిడీ చేస్తున్న ఈ పాలకులకు పట్టడం లేదు. కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాలను గుప్పెట్లో పెట్టుకుని విద్యా వ్యవస్థను శాసిస్తున్నాయన్న ఆరోపణల వినవస్తున్న నేపథ్యంలో పాలక వర్గంలో ఉన్న వారు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంత సేపటికి ఎటువంటి ఉచితాలు ప్రకటించాలి, వాటిని నెరవేర్చడానికి వేటిని విక్రయించాలి, ఆదాయ మార్గాలు ఏమిటన్న దానిపై ఆలోచన తప్ప భవిష్యత్ సమాజ నిర్మాణమేమిటన్న దానిపై పాలకులు దృష్టి సారించడం లేదు. ఇదే రీతి కొనసాగితే భవిష్యత్ సమాజ పరిణామాలకు ప్రస్తుత పాలకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రైవేటులో ఫీజుల నియంత్రణ, ప్రభుత్వ విద్యకు ప్రోత్సాహం, విద్యారంగ సమతుల్యతను కాపాడడం పాలకులు తమ బాధ్యతగా గుర్తెరిగితే మంచిది.

# పురిటి బిడ్డ బలి

(మొదటిపేజీ తరువాయి)
తాగి మృతి చెందాడు. ఈ ఘటనపై గర్భిణీ బంధువులు వైద్యుడ్ని నిలదీయగా పురుడు పోసే సమయంలో చిన్నారులు చనిపోవడం సహజమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటం విశేషం. పూర్తి వివరాల్లోకి వెళితే.... ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన గర్భిణీ దడిపల్లి లావణ్య శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో తల్లాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. అయితే తల్లాడ పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ రత్నమనోహర్ శుక్రవారం విధులకు సెలవు పెట్టారు. దీంతో అన్నారుగూడెం పల్లె దవాఖానా వైద్యుడు వై.గోపి తల్లాడ పిహెచ్‌సిలో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గర్భిణీ లావణ్యకు శుక్రవారం సాయంత్రం 4గంటల సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి. ఆ సమయంలో లావణ్య భర్త అశోక్ స్టాఫ్ నర్స్ కళావతి వద్దకు వెళ్లి విషయాన్ని చెప్పాడు. అయితే సెల్‌ఫోన్‌లో రీల్స్ చూసుకుంటున్న కళావతి పురిటినొప్పులు అలానే వస్తాయని, మరో రెండు గంటలు నొప్పులు రావాల్సి ఉంటుందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది. గర్భిణీ మహిళకు పురిటి నొప్పులు వస్తుంటే సెల్‌ఫోన్‌లో రీల్స్ చూసుకుంటూ స్టాఫ్ నర్స్ నిర్లక్ష్యంగా వ్యవహరించి కాలయాపన చేశారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆతర్వాత అన్నారుగూడెం నుండి తల్లాడ పిహెచ్‌సికి వచ్చిన వైద్యుడు గోపి తమ సిబ్బందితో కలిసి లావణ్యకు డెలవరీ చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో బాలుని తల భాగం కొంతమేరకు బయటకు వచ్చింది. మిగిలిన భాగం బాలుడు బయటకి రాకపోవడంతో పాటు లావణ్య పల్స్ రేటు పడిపోయింది. దీంతో వెంటనే వైద్యుడు గోపి సగం పురుడు పోసిన మహిళను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించాలని ఆమె బంధువులకు తెలిపాడు. దీంతో గర్భిణీ మహిళ భర్త అశోక్‌తో పాటు వారి బంధువులు ఆసుపత్రిలో ఆందోళన చేశారు. అదే సమయంలో పిహెచ్‌సి పక్కనే 108 వాహనంలో ప్రమాదకరంగా ఉన్న గర్భిణీ మహిళను ఖమ్మం తరలించాలని ఆ సిబ్బందిని లావణ్య బంధువులు వేడుకున్నారు. అయితే 108 వాహన సిబ్బంది ఇది క్రిటికల్ కేసు అని, తాము తీసుకుపోలేమని చేతులెత్తేయటం గమనార్హం. గర్భిణీ మహిళ బంధువులు ఆందోళన చేస్తుండటంతో వైద్యుడు గోపి సగం బయటకి వచ్చిన బాలుడిని బలవంతంగా బయటకి తీశాడు. అప్పటికే ఉమ్మనీరు తాగిన బాలుడు మృతి చెందాడు. అనంతరం అపస్మారక స్థితికి వెళ్లిన లావణ్యను ఆమె భర్త బంధువులు దిక్కుతోచని స్థితిలో కారులో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే డాక్టర్ నిర్లక్ష్యపు వ్యవహారంపై బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో డాక్టర్ గోపి మాట్లాడుతూ తాను చాలా డెలవరీలు చేశానని, చిన్నారులు ఇలా చనిపోవడం సహజమని చెప్పటం విశేషం. ఇదిలా ఉంటే లావణ్య కుటుంబసభ్యులు ఆందోళన చేసే సమయంలో స్టాఫ్ నర్స్ కళావతి కుమారుడు మండల వైద్యాధికారి కుర్చీలో కూర్చొని హల్‌చల్ చేయటం విశేషం. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేపించుకోవాలని ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు తమ గ్రామానికి వచ్చి బలవంతం చేయటం వల్లె తల్లాడ పిహెచ్‌సికి గర్భిణీ మహిళ లావణ్య వెళ్లింది. ఆమె అంతకు ముందు వరకు వైరాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంది. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, బాధిత మహిళ బంధువులతో శనివారం చర్చలు జరిపారు. ప్రస్తుతం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లావణ్య వైద్య ఖర్చులు భరించటంతో పాటు మరో రూ.10వేలను నష్టపరిహారంగా ఇచ్చేందుకు వైద్యుడు అంగీకరించటంతో ఈ వ్యవహారం సద్దుమణిగింది. ఏదిఏమైనా ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఇలాంటి సంఘటనలు జరగటంతో ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజల్లో పూర్తిగా నమ్మకం సన్నగిల్లుతోంది.

# నీట్ అక్రమాలకు కేంద్రం సిగ్గుపడాలి

**ప్రజాపక్షం–నేలకొండపల్లి :** జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ నిర్వహించిన పరీక్షలలో అక్రమాలు జరగటం పట్ల కేంద్రం సిగ్గుపడాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యాక్షుడు బోయిన వేణు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...నీట్ లో జరిగిన అక్రమాల పై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. విద్యా శాఖ ను కేంద్రం వ్యాపార కేంద్రంగా మార్చిందని అగ్రహం వ్యక్తం చేశారు. లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమ ఆడుతుందని అన్నారు. నీట్ పై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజెపీ అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల పై క్షేత్ర స్థాయిలో పోరాడాతామని అన్నారు. నీట్ అక్రమాలను ప్రతీ ఒక్కరూ ఖండించాలని సూచించారు.

# ఖమ్మం కీర్తి పెరిగేలా అభివృద్ధి



(మొదటిపేజీ తరువాయి)
నిర్మించుకున్నప్పటికీ ఇంటి నెంబర్లను కేటాయించ లేదని తక్షణం ఇంటి నెంబర్లను కేటాయించాలని ఆయన ఆదేశించారు. వర్షాకాలం కావడంతో ఎక్కడ డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినకుండా చూడాలని మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని మొక్కలు నాటేటప్పుడు విద్యుత్ తీగల క్రింద నాటరాదని ఆయన సూచించారు. నగరంలో రోడ్లను విస్తరించాలని అందుకు అనుగుణంగా ప్రజలను ఒప్పించాలని తెలిపిన తుమ్మల త్వరలోనే జాతీయ రహదారులకు అనుసంధానంగా రోడ్లను నిర్మించి వాహనాల రద్దీని తగ్గిస్తామని ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల తర్వాత ముఖ్యమంత్రితో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని అప్పటి వరకు తాత్కాలిక ఏర్పాట్లతో ప్రజలకు తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి ఒక ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలన్నారు. అభివృద్ధి ప్రణాళికతో పాటే ఆదాయ పెంపు ప్రణాళికను కూడా రూపొందించాలన్నారు. ఆస్తి, వాణిజ్య, నీటి పన్నుల వసూళ్లను 100 శాతం చేపట్టాలన్నారు. చెత్త సేకరణ సమర్థవంతంగా జరగాలని, అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంతకు ముందు మంత్రి హోదాలో సమీక్షకు హాజరైన తుమ్మల నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/ కల్లూరు :** కల్లూరు మండలం రఘునాథబంజర లో సివిల్ సప్లయ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 15 క్వింటాళ్ల పిడిఎఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. షేక్ మస్తాన్ పై 6ఎ సెక్షన్ క్రింద కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డిటి చందన్‌కుమార్ తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ఆర్ఐ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే కల్లూరు ఎన్నెస్పిలో హోటల్‌లో గృహ అవసరాల కోసం వాడే సిలెండర్‌ను వాడుతుండడంతో హోటల్ యజమాని పై 6ఎ క్రింద కేసు నమోదు చేసినట్లు చందన్‌కుమార్ తెలిపారు.

## గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పద్మావతి



**ప్రజాపక్షం–నేలకొండపల్లి :** స్థానిక సంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ గా యం.పద్మావతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఇంచార్జీ ప్రిన్సిపాల్ గా ఉన్న ప్రమీలా నుంచి బాధ్యతలు తీసుకున్నారు. గతేడాది ఆక్టోబర్ 17 నుంచి ఇంచార్జీ ప్రిన్సిపాల్ గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం బాధ్యతలు స్వీకరించిన పద్మావతి గతంలో ఇదే గురుకుల కాలేజీలో జూనియర్ లెక్చరర్ గా బాధ్యతలు చేపట్టారు. 2018 లో ఖమ్మం బదిలీ పై వెళ్లారు. ప్రస్తుతం ఎర్రుపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గా ఉన్న పద్మావతి, బదిలీ పై వచ్చారు. నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి గ్రామం కు చెందిన వారు. మరో పది నెలలలో పదవి విరమణ చేయనున్నారు. బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆధ్యాపకులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

## ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించాలి



**ప్రజాపక్షం–నేలకొండపల్లి :** ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించాలని నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో శనివారం రోడ్డు పై నిలిపిన వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు పై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ హెల్మట్ ధరించాలని అన్నారు. మండలం లో అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. యువత చెడు మార్గాల వైపు పయనించకుండా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నేర రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు పాలేరులో మంత్రి పొంగులేటి పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పాలేరు నియోజక వర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం మధ్యాహ్నం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తారని మధ్యాహ్నం 3.30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం కొండాపురంలో సిసి రోడ్ల నిర్మాణానికి సాయంత్రం 4.30 గంటలకు ఆరెంపులలో బిటి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. రూరల్ మండల పరిధిలోని గూడూరుపాడు లో హెల్త్ సబ్ సెంటర్‌ను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. తనగంపాడులో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని దయాకర్‌రెడ్డి తెలిపారు.

# ఆ వార్తలు నిజం కాదు

## -బిఆర్‌ఎస్‌లోనే కొనసాగుతా :ఎంపి వద్దిరాజు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిఆర్‌ఎస్ ఎంపిలు బిజెపిలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను బిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నాయకులు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. బిజెపిలో చేరుతున్నామని బిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ బిజెపిలో విలీనమవుతుందని కొన్ని పత్రికలు కావాలని అభూత కల్పనలు సృష్టిస్తున్నాయని రవిచంద్ర తెలిపారు. బిఆర్‌ఎస్‌ను బలహీనపరిచేందుకు వాస్తవ విరుద్ధ కథనాలను ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. కేసిఆర్ నాయకత్వంలోనే తాము పని చేస్తామని రవిచంద్ర స్పష్టం చేశారు.

# బేబీమూన్‌లో వంటకాల వేడుక





**ప్రజాపక్షం/ ఖమ్మం :** బేబీమూన్ యంగ్ విస్ట్ 2024 పేరుతో శనివారం బేబీమూన్ విద్యాలయంలో వంటల వేడుక నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి, మొదటి తరగతి విభాగంలో పలు రకాల ఉత్తర, దక్షిణ భారతీయ వంటకాలను తయారు చేశారు. చెఫ్ డ్రెస్సింగ్‌తో స్టాల్ ఏర్పాటు చేసి ఈ వంటకాల వేడుకను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కేసా వీరన్న ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ఆరోగ్యం మన ఆహార అలవాట్ల పై ఆధారపడి ఉంటుందన్నారు. ఆరోగ్యవంతులే ధనవంతులవుతారని ఆరోగ్యం కోసం పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వీరన్న తెలిపారు. మన లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఆరోగ్యం సహకరించాలని ఆయన తెలిపారు. మానవ జీవన శైలిలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయని నేటి తరం సాంప్రదాయ వంటలకు దూరమవుతుందని రాను రాను ఫాస్ట్ ఫుడ్ కల్చర్ పెరుగుతుందన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమని వీరన్న హెచ్చరించారు. స్థానిక పరిస్థితులకు తగిన విధంగా జీనవ శైలిని అలవర్చుకుని ఆరోగ్యంతో కూడిన ఆహారాన్ని భుజించాలన్నారు. నేటి తరం ఆరోగ్యంగా ఉన్నప్పుడే మంచి సమాజం నిర్మితమవుతుందని తెలిపారు.

# విష తుల్య చెట్లను తొలగించండి



**ప్రజాపక్షం/కల్లూరుః** విషతుల్య చెట్లను తొలగించాలని కల్లూరు మండల పరిధిలోని ప్రజలు అధికారులను కోరుతున్నారు. మండలంలో వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, అంతర్గత రోడ్ల , ఇరువైపులాఉన్న చెరువు కట్టలపై ఉన్న కొనో కార్పస్ మొక్కలు వలన వచ్చే గాలి ఆరోగ్యానికి హానికరం చేస్తాయని శాస్త్రజ్ఞులు తెలపడంతో ఆ మొక్కలను తొలగించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో కల్లూరు పట్టణం మరియు పరిసర గ్రామాలలో ఉన్న ఈ మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో అవి అందంగా ఆహ్లాదకరంగా ఉండటంతో, ఆ మొక్కల వలన నష్టం వస్తుందని తెలియక రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలలో వేశారు. వాటిని ప్రస్తుతం నిషేధించడం వలన వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# కళకళలాడుతున్న ఆరుతడి పంటలు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మం డల పరిధిలోని పలు గ్రామాలలో ఖరీఫ్ సీజన్లో వేసిన ఆరుతడి పంటలు ఋతుపవనాలు రావడంతో మెట్ట పం టలు కళకళ లాడుతున్నాయి. కల్లూ రు మండలంలో పత్తి 2000 ఎకరా లు, పెసర 150 ఎకరాలు, మొక్క జొన్న 15 ఎకరాలలో ప్రస్తుతం కొనసాగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మండల అధికారి రూప తెలిపారు. అడపా దడపా వస్తున్న వర్షాలకు మెట్టపైర్లు కళకళలాడుతున్నవి. కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, మర్లపాడు , పోచవరం, వెంకటాపురం, ముచ్చవ రం, బత్తుల పల్లి, లక్ష్మీ పురం , పేరువంచ, కల్లూరు, చంద్రు పట్ల, రఘునాథ గూడెం తదితర గ్రామాలలో పంటలు ఆశాజనకంగా పెరుగుతున్నాయి. ఒక్కో ఎకరాకు సుమారుగా మెట్ట పంటలు 50 వేలు పెట్టుబడి ప్రణాళికతో రైతులు కొనసాగిస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు.

# నూతన దర్గా వద్ద హోమగుండం ఏర్పాటు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడలోని పాత తహశీల్దార్ కార్యాలయం సమీపంలో నూతన దర్గాను నిర్మించిన విషయం తెలిసిందే. మొహరం పర్వదినం సందర్భంగా పీర్ల సావిడి వద్ద ముస్లిం సోదరులు వివిధ కార్యక్రమాలు గత కొన్ని రోజులు నుండి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దర్గాకు ఎదురుగా హోమగుండాన్ని ఏర్పాటు చేశారు. నిత్యం వర్షం వస్తున్నప్పటికీ ఆ హోమగుండం మాత్రం వెలుగుతూనే ఉంటుంది. దీన్నే ముస్లిం సోదరులు విశ్వాసంగా భావించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గత ఐదు రోజులు నుండి పీర్ల సావిడి వద్ద వేడుకలు జరుగుతున్నాయి. ఈ నెల 18వ తేదీన వైభవంగా కార్యక్రమాలు జరుగుతాయని, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమానికి ముస్లిం సోదరులందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# నారాయణపురంలో పీర్ల వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** మొహరం పర్వదినం సందర్భంగా తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామంలో మస్లిం సోదరులు పీర్ల సావిడి వద్ద శనివారం వేడుకలు నిర్వహించారు. షేక్.కమాల్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ముస్లిం సోదరులు డప్పు వాయిద్యాలు, నృత్యాలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పీర్లను తల్లాడ పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు షేక్.మెహరాజ్, నాగులుమీరా, నన్నే, బడే, చాంద్‌పాషా, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి





**ప్రజాపక్షం/కరకగూడెంః** వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కరకగూడెం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కారం మధు గ్రామస్థులను కోరారు. మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో శనివారం ఆయన సిబ్బందితో కలిసి ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రజలకు సంబంధించిన వ్యాధులకు ట్రీట్మెంట్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ జబ్బులను నివారించుటకై ప్రజలంతా తమ బాధ్యతగా చైతన్యవంతంతో తమ ఇండ్లలోని గోళాలు, డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలలోని నీటిలో తోక పురుగులు (దోమల లార్వా లు) లేకుండా క్లీన్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామమంతటా డ్రైడ్ యాక్టివిటీస్ (ఆంటీ లార్వల్ ఆపరేషన్) ఫీవర్ సర్వే కండక్ట్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అంతా వర్షం సైతం లెక్కచేయకుండా కాలినడకన రెండు కిలోమీటర్లు బైక్స్ కూడా వెళ్ళలేనటువంటి మట్టి రోడ్డులో నడుస్తూ గ్రామానికి చేరుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్థులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, నరసింహా, ఏఎన్ఎం విజయలక్ష్మి , ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మందడపు రామారావుకు పరామర్శ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం మల్లారం గ్రామంలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి మందడపు రామారావు కిడ్నీ సమస్యతో అస్వస్థతకు గురై విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. శనివారం స్వగ్రామంలోని తన ఇంటి వద్ద రామారావును సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, ఏనుగు వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు పరామర్శించారు. ఈ సందర్భంగా రామారావు ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్, సిపిఐ మధిర మండల సహాయ కార్యదర్శి చావా మురళీకృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు సట్టు అశోక్, కర్నాటి కోటేశ్వరరావు, నరేంద్రసాయి తదితరులు పాల్గొన్నారు.

# పల్లెయాత్రను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మండలంలో ఏండ్లుగా పేరుకుపోయిన ప్రజా సమస్యలపై, జూలై 15 సోమవారం నుండి పల్లె పాదయాత్ర చేస్తున్నానని మణుగూరుకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త కర్నె రవి ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరును మున్సిపాలిటీ చేసి, వేల మంది ప్రజలకు ఉపాధి హామీ పని లేకుండా చేసారని, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ప్రస్తుత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారి స్వార్ధ రాజకీయం చేశారే తప్ప పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. జూలై 15 సోమవారం నుండి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు తాను పల్లె యాత్ర చేపడుతున్నానని, ఉచిత విద్య, ఉచిత వైద్యం, నిరుద్యోగ యువతి యువకులు ఉపాధి కల్పించేందుకు, రైతులకు గిట్టుబాటు ధర, సింగరేణి కార్మికుల హక్కుల సాధన వంటి ప్రధాన అంశాలే ఎజెండాగా తన పల్లె యాత్ర సాగుతుందన్నారు. తోగ్గుడెం, ముత్యాలమ్మ నగర్, గుట్ట మల్లారం, లంక మల్లారం, కూనవరం, కట్టు మల్లారం, విప్పల సింగారం, సమితి సింగారం, తీర్లాపురం, రామానుజవరం, బుగ్గ, పగిడేరు, సాంబాయిగూడం, దమ్మక్కపేట పంచాయతీల్లో పల్లె యాత్ర, అక్కడే పల్లె నిద్ర ఉంటుందని యాత్రను ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మణుగూరు శ్రీ చైతన్య పాఠశాల అత్యుత్సాహం

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరులోని శ్రీ చైతన్య పాఠశాల నిర్వాహకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. రెండో శనివారం పాఠశాల సెలవు.. కానీ నో బ్యాగ్ డే అంటూ విద్యార్థులను పాఠశాలకు రావాలని మెసేజ్ లు పెట్టారు. తీరా వచ్చాక తల్లిదండ్రులు వచ్చి పిల్లలను తీసుకుపోవాలి అంటూ తిరిగి మెసేజ్‌లు పంపించారు. అందుబాటులో లేని తల్లిదండ్రులు పరిస్థితి ఏంటి అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అసలు నో బ్యాగ్ డే అంటూ పెట్టాల్సిన అవసరం ఏంటి అంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షం.. తల్లిదండ్రులు అందుబాటులో లేరు.. ఆ పిల్లల పరిస్థితి ఏంటి అని, రెండు గంటలకోసం పాఠశాలకు విద్యార్థులను పిలిపివ్వడం ఎందుకు..? మళ్లీ తల్లితండ్రులను ఇబ్బంది పెట్టడం ఎందుకు అని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నీటి ప్రవాహాలు దాటే ప్రయత్నం చేయవద్దు



**ప్రజాపక్షం/గుండాల:** నీటి ప్రవాహాలు దాటే ప్రయత్నం చేయవద్దని ఇల్లందు డిఎస్‌పి చంద్రభాను అన్నారు. శనివారం శెట్టిపల్లి మార్గంలో అధిక నీటి ప్రవాహం గల వాగులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలు పడినప్పుడు వాగులు, వంకలు పొంగిపొర్లుతాయని, ఆ సమయంలో గ్రామస్తులు ఎవరు వాగును దాటే ప్రయత్నం చేయకూదని సూచించారు. పోలీసు, అధికారుల సూచనలను తప్పక పాటించి ఇండ్లలోనే ఉండాలని సూచించారు. అలాగే కొన్ని వాగుల ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను గ్రామస్తుల సహాయంతో తొలగించి, నీటి ప్రవాహం సాఫీగా జరిగేటట్లు చేశారు. ఈ చుట్టు పక్కల ప్రాంతంలో ఎటువంటి ప్రమాదాలు జరిగిన తక్షణమే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈకార్యక్రమంలో గుండాల సిఐ రవీందర్, కొమరారం ఎస్ఐ సోమేశ్వర్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులను కలిసిన బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు నాగరాజు





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీ బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు కలిశారు. శనివారం ప్రజాభవన్ నందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండ్ల గణేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. అనంతరం గాంధీభవన్ నందు భువనగిరి ఎంపి శ్యామల కిరణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు.

## బాల్ బాడ్మింటన్ క్రీడను ఆదరించాలి

**-స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌కు వినతి**



**ప్రజాపక్షం/బోనకల్:** నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కె శివసేనరెడ్డిని మండలానికి చెందిన బాల్‌బాడ్మింటన్ జాతీయ క్రీడాకారులు శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. బాల్‌బాడ్మింటన్ క్రీడలో పూర్తి స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో విద్య, ఉద్యోగ విభాగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, క్రీడాకారులను ఆదుకోవాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కె శివసేనరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు క్రీడాకారులు తెలిపారు. స్పోర్ట్స్ అథారటి ఛైర్మన్ కలిసిన వారిలో భూక్యా ఉమా, ప్రియాంక, అజగర్ తదితరులున్నారు.

## హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా ప్రొద్దుటూరు వాసి



**ప్రజాపక్షం/ చింతకాని :** హైకోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన కూరపాటి సుజాతను ప్రభుత్వం నియమించింది. రెండు రోజుల క్రితం హైకోర్టుకు వివిధ శాఖల తరపున 19మంది ప్రభుత్వ ప్లీడర్లను నియమించగా వారిలో సుజాత ఒకరు కావడం గమనార్హం. సుజాత తల్లిదండ్రులు కూరపాటి వెంకటేశ్వర్లు, భద్రమ్మకాగా ఆమె 1996 నుండి హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

# ఎక్కడబడితే అక్కడే పార్కింగ్..!

**-ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం**
**-ఇబ్బందులు పడుతున్న పాదచారులు**
**-పట్టించుకోని సంబంధిత అధికారులు**



**ప్రజాపక్షం/కరకగూడెం:** వాహనదారులు తమ వాహనాన్ని నిలుపుదల చేయడానికి ప్రధాన రహదారికి అతి సమీపంలో గల ప్రదేశాన్ని ఉపయోగించుకుంటున్నారు. మేమింతే! మమ్మల్ని ప్రశ్నించేదెవరు...? ఆపేదెవరు..!? అనే తరహాలో ఉంది మండల కేంద్రమైన కరకగూడెం. నిత్యం కనిపించే దృశ్యాలే! ప్రధాన రహదారికి అతి సమీపంలోని ప్రదేశం వద్ద వాహనదారులు పార్కింగ్ చేస్తున్న వైనంపై, అవగాహన కల్పించాల్సినఆవశ్యకత ఉంది. అందులోనూ చుట్టుపక్కల వందకు పైగా పల్లెలు ఉన్న ప్రాంతం. మండలంలోని ప్రజలందరూ ఖచ్చితంగా రావాల్సిన ప్రాంతం మండల కేంద్రమైన కరకగూడెం ప్రాంతం. దీంతో పాటుగా రంగాపురం, గుండాల సెంటర్ కూడా మూడు రహదారుల కూడలి ఉన్న ప్రదేశం. కరకగూడెంలోనే ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పోలీస్ స్టేషన్, మీసేవ కేంద్రాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతం. అలాగే సెంటర్లో బ్యాంక్, మీసేవ కేంద్రం, వాణిజ్య వ్యాపార కేంద్రానికి అనువుగా ఉన్న ప్రదేశం. కరకగూడెం గ్రామాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అందులోనూ వరంగల్, రంగపురం, గుండాల, మణుగూరు భద్రాచలం కొత్తగూడెం ప్రధాన రహదారి ఉన్న ప్రదేశాలు. ఈ ప్రాంతానికి వచ్చే వాహనదారులు ఎక్కడపడితే అక్కడ.. ఎట్లా పడితే అలా వాహన పార్కింగ్ చేస్తున్నారు. ఇందులోనూ ప్రధాన రహదారికి అతి సమీపంలో వాహన పార్కింగ్ చేయడం వలన ప్రమాదం పొంచి ఉందనే చెప్పాలి. ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించిన చెల్లించాల్సిన మూల్యం భారీగానే ఉంటుందని చెప్పవచ్చు. ఈ దృశ్యాలకు కేరాఫ్ అడ్డాగా ఉన్న కరకగూడెం సెంటర్ ఎంపీడీవో ఆఫీస్ ప్రాంతాలను పట్టించుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే చెప్పాలి. వాణిజ్య వ్యాపార కేంద్రాలకు అనువుగా ఉన్న ప్రదేశాలే. వాహనదారులు సొంత పనుల మీద వచ్చి దుకాణాల ముందర గల ప్రధాన రహదారి వద్ద అతి సమీపంలో గల ప్రదేశం వద్ద వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదం సంభవిస్తే దానికి బాధ్యత వహించేదెవరు..!? ఆ నష్టాన్ని పూడ్చేదెవరు..!? అనే అంశాలు ఎవరికి పట్టవనే చెప్పాలి. అనుకోకుండా ప్రమాదం సంభవించాక తీసుకునే జాగ్రత్తలు కన్నా ముందుగానే పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే మేలే జరుగుతుందని చెప్పవచ్చు. అసలు వాహనదారులకు అవగాహన కల్పించే వారెక్కడ..!? రోడ్డు భద్రతా నియమాలు అతిక్రమించి పార్కింగ్ చేస్తున్న వారిపై జరిమానా విధించే వారేరి..!? పర్యవేక్షించే అధికారులు ఏరి..? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని చెప్పకనే చెప్పవచ్చు. ఏది ఏమైనా ప్రధాన రహదారికి అతి సమీపంలో వాహనాలు పార్కింగ్ చేయకుండా తీసుకోవాలని పలువురు అధికారులను కోరుతున్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను కోరుతున్నారు.

**రూ.కోటి 50 లక్షల వ్యయంతో**

## తుమ్మలచెరువు కట్టపై బిటి రోడ్డు నిర్మాణం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని హైదర్ సాయిపేట గ్రామం పై మంత్రి పొంగులేటి దృష్టి సారించారు. ఆన చెప్పిందే విధంగా అధికారులు యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టారు. హైదర్ సాయి పేట నుండి అజ్మీర్ తండా వరకు తుమ్మలచెరువు కట్టమీద రహదారి నిర్మాణం కోసం రైతులు, అంతర్ జిల్లాల గ్రామాల ప్రజలు ఎప్పటినుండో ఆ రోడ్డు నిర్మాణం కావాలని కోరుకుంటున్నారు. రాష్ట్రాలు మారిన ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఎంతమంది మంత్రులు మారిన ఆ పనులు జరగలేదు ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత నియోజక వర్గ పాలేరు అభివృద్ధిపై దృష్టి సాధించారు. ఆయన సొంత నియోజక వర్గంలోని తిరుమలాయపాలెం మండలం హైదర్ సాయి పేట గ్రామంలో ఇటీవల ఓ కార్యక్రమానికి హాజరు కాగా మండల కాంగ్రెస్ నాయకులు బానోత్ చిమ్లా నాయక్, గ్రామ సమస్యలను విన్నించగా వెంటనే స్పందించిన మంత్రి పొంగులేటి ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకోగా తుమ్మలచెరువు కట్టపై బీటీ రోడ్డు నిర్మాణానికి అడిగారు వెంటనే అధికారులను ఆదేశించి రోడ్డు నిర్మాణానికి అయ్యే పనులకు ఎస్టిమేషన్ పంపియాలని, పురాయించగా అధికారులు అజ్మీర్ తండా నుంచి వరకు 1.5 కిలోమీటర్లు ఉంటుందని చెరువు కట్ట మరమతులతో పాటు బిటి రోడ్డు నిర్మాణానికి ఒక కోటి 50 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పగా స్పందించిన మంత్రి వేగవంతంగా పనులు పూర్తి చేయాలని చెప్పగా అధికారులు, గుత్తేదారుడు పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలతో పాటు అంతర్ జిల్లాల అంతర్గత గ్రామాలకు మండలాలు కలుపుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంత కాలానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందని, ఈ ప్రాంత ప్రజలు సంతోష వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రుణ పడి ఉంటామని ఆయన వెన్నవెంట జీవితాంతం పని చేస్తామని అభివృద్ధి ప్రదాత మంత్రి పొంగిలేటికి హైదర్ సాయి పేట గ్రామ ప్రజలు తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# శివయ్యగారి బజార్‌లో చోరీ..

**- బంగారం, నగదు అపహరణ**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బంగారం, నగదును అపహరించుకుపోయిన సంఘటన శనివారం పట్టణంలోని శివయ్యగారి బజార్‌లో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలశెట్టి గోపాలకృష్ణ తన కుటుంబసభ్యులతో కలిసి మూడు రోజులు క్రితం దైవదర్శనం నిమిత్తం పెద్ద తిరుపతికి వెళ్లారు. ఇంటి పనిమనిషి ఇంటి ఆవరణం శుభ్రం చేసేందుకు రాగా ఇంటి వెనుక తలుపులు తీసి ఉండటంతో చుట్టుపక్కల ప్రజలకు తెలిపింది. ఈ విషయం ఇంటి కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. యజమాని గోపాలకృష్ణ ఇంటికి చేరుకుని పరిశీలించగా బీరువాలో ఉన్న రెండు మూడు కాసుల చైన్‌లు, అరకాసు చెవిదిద్దలు కాసున్నర బంగారు గాజు, రెండు వెండి గిన్నెలు బీరువాలో ఉంచామని, అవి దొంగలు అపహరించుకునిపోయారని తెలిపారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచానామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొత్తగూడెం క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు.

# ఖాళీ స్థలాలు.. దోమలకు నిలయాలు..!



**-పేరుకుపోతున్న చెత్తాచెదారం**
**-పట్టించుకోని స్థల యజమానులు**
**-నిర్లక్ష్యంలో అధికారులు... ఆందోళనలో స్థానికులు**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాలలో ఖాళీ స్థలాలలో నీరు నిలవబడి ఉండటం వల్ల దోమలు పెరిగి విజృంభించి యువతీ యువకులు, వృద్ధులు, పిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారు. పట్టణంలోని ఖాళీ స్థలాలలో నీరు నిలవబడి ఆవాసం ప్రాంతాల మధ్య ఉండటంవల్ల చెత్తాచెదారం పేరుకుకొని పోయి దోమలు పెరగటం వలన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థల యజమానులు పట్టణంలో కొనుగోలు చేసి వేరే ప్రాంతంలో నివాసం ఉండటం వలన అదే ప్రాంతంలో అదే స్థలంలో నీరు నిలబడి దోమలు, పందులు, ఈగలు స్థావరం కావడం వలన సమీపంలోని నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా వారికి పట్టించుకోవడం లేదు దాంతోపాటు సంబంధిత అధికారులు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు. కల్లూరు పట్టణంతో పాటు పలు గ్రామాలలో పెద్ద కోరుకొండి , చిన్న కోరుకొండి, వెన్నవల్లి, చెన్నూరు ,ముచ్చవరం, లింగాల, పేరువంచ, బత్తులపల్లి ,లక్ష్మీ పురం తదితర గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొని ఉన్నదని ఆయా గ్రామాల ప్రాంత ప్రజలు తెలుపుతున్నారు. సంబంధిత శాఖ గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు చర్యలకు ఖాళీ స్థలాల యజమానులపై చర్యలు తీసుకొని దోమలు నివారణకు నోటీసులు ఇచ్చి ప్రత్యేకమైన చర్యలకు ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు.

## కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో పారదర్శకత పాటించేనా..?




**నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేనా..?**

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి హై స్కూల్ లో ఉపాధ్యాయులు, సిబ్బంది 10 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీకి సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పటికే పలు పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుండి పెద్ద ఎత్తున దరఖాస్తులు కూడా వచ్చాయని తెలుస్తుంది. పోస్టుల భర్తీ పారదర్శకంగా అర్హులకు కాకుండా పైరవీలకు పెద్దపీట వేస్తూ బ్యాక్ డోర్ లో ప్రయత్నాలు నడుస్తున్నాయని విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో మేమే మీకు ఫోన్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ అందుకు విరుద్ధంగా పాఠశాలలో తమ అనుకున్న వారితో గుట్టు చప్పుడు కాకుండా ఇంటర్వ్యూలు జరుగుతున్నాయనే గుస గుసలు మెండుగా వినపడుతున్నాయి. ఇదే నిజమైతే అర్హులకు తీరని అన్యాయం జరిగినట్లేనని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. సమర్థులను పక్కన పెడితే దీని ప్రభావం విద్యార్థుల ఎడ్యుకేషన్ పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు మేధావులు అభిప్రాయ పడుతున్నారు. అలా కాకుండా పారదర్శకంగా పోస్టుల భర్తీకి తగు చర్యలు చేపట్టాలని సింగరేణి యాజమాన్యాన్ని అభ్యర్థులు కోరుతున్నారు.

# ఏరియా హాస్పిటల్‌ను సందర్శించిన సింగరేణి జిఎం



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, డివై.సిఎంఓ మేరీ కుమారి కలిసి శనివారం పివి కాలనీలోని సింగరేణి ఏరియా హాస్పిటల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా హాస్పిటల్ లోని అన్నీ వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యల గురించి తెలుస్కున్నారు. వారికి అవసరమైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ వర్షాకాలము నందు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని,వాటి నుంచి కాపాడుకోవడానికి గాను ప్రజలందరు ఇంటా బయట పరిశుభ్రతను పాటించాలన్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు దోమల వల్ల సోకుతాయని,వాటిని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవడానికి వైద్య అధికారులకు సూచనలు చేశారు. అలాగే వ్యాధుల నివారణకు అవసరమైన మందు సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని సూచనలు చేశారు. ఇంకా కాలనీల్లో నివసిస్తున్న కార్మికులను దోమలు, కుక్కల బెడద నుంచి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. రామారావును ఆదేశించారు. తరచుగా ఉద్యోగుల కాలనీలలో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం మరియు మురుగు కాలువల పరిశుభ్రత చేయవలసినదిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో.. డివై.సిఎంఓ మేరీ కుమారి, డాక్టర్ శేషగిరి రావు, ఇతర హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి పంచాయతీ కార్మికుడి మృతి



**ప్రజాపక్షం/బోనకల్:** మండల కేంద్రంలోని బోనకల్ గ్రామానికి చెందిన మరీదు లక్ష్మ ణ(40) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి మడుగులో పడి శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..లక్ష్మ ణ బోనకల్ గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్మికుడుగా పనిచేస్తూ రెండవ శనివారం సెలవు కావడంతో ఆళ్లపాడు రోడ్డులోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న మడుగులో చేపల వేటకు వలతో వెళ్లాడు. వలను విసిరే క్రమంలో లక్ష్మ ణ నీటి మడుగులో పడిపోయి కాళ్లకు వల చిక్కుకోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. లక్ష్మ ణ కేకలు వేయడంతో పరిసర ప్రాంతంలో ఉన్న యువకులు మునిగిపోయిన యువకుడిని బయటకు తీసి ప్రథమ చికిత్స అందించి స్థానిక ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృత దేహన్ని స్థానిక పోలీసులు పరిశీలించి కేసు నమోద చేసి పోస్టు మార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలిచారు. మృత దేహన్ని తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ గుగులోత్ లక్ష్మ ణ్, మాజీ సర్పంచ్ భూక్యా సైదానాయక్, వైఎస్ ఎంపిపి గుగులోత్ రమేష్, పంచాయతీ కార్మికులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ని కలిసిన కిరణ్



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌ని సారపాకలోని ఐటిసి గెస్ట్ హౌస్‌లో శనివారం బూర్గంపాడు మండల మాల మహానాడు అధ్యక్షులు తుమ్మల కిరణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కొట్టే అనిల్, ఇరుగు ఈశ్వర్‌రావు, మంద పాశ్చట పాల్గొన్నారు.

## ఎస్ఐ రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు




**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రాజశేఖర్‌ని మర్యాదపూర్వకంగా టిడిపి నాయకులు కలిశారు. ఈసందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తేళ్ల చెన్నయ్య, మండల నాయకులు బిక్కుమల్ల సుధాకర్, మిరియాల శంకర్‌రావు, చవ్వా ప్రసాద్, డ్రైవర్ సుధాకర్‌రావు, పాత్రికేయులు పువ్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రుడికి చేయూత అండ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన క్షతగాత్రుడు వీరబాబుకు మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం ఉప్పర మద్దిగట్ల గ్రామానికి చెందిన కొమ్మత్తిని వీరబాబు అనే వ్యక్తికి గత నాలుగు రోజుల క్రితం కళ్ళు తిరిగి కింద పడటంతో తలకి తీవ్ర గాయం కాగా భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొని వచ్చి వైద్యం అందిస్తున్నారు. క్షతగాత్రుడి భార్య నిరోష ఆమె తల్లి బూర్గంపాడు గ్రామం కావడంతో తల్లికి ఉన్న ఇల్లు, రేషన్‌కార్డు తాకట్టు పెట్టి సుమారు రూ 40వేలతో గత నాలుగు రోజుల నుండి వైద్యం అందిస్తున్నారు. ఈవిషయం చేయూత ట్రస్ట్ దృష్టికి రావడంతో గంట సమయంలో రూ 4వేల ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షులు కె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కైపు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి మల్లారెడ్డి, కోశాధికారి పుట్టి రాజేష్, సభ్యులు శనగా మల్లేశ్వరరావు, తమ్మినేని శ్రీనివాస్, బిజ్జం వెంకట్రామిరెడ్డి, బొబ్బల వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీలు ఎన్నిక



**ప్రజాపక్షం/చర్ల:** చర్ల మండల పరిధిలోని శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపం ఫంక్షన్ హాల్ నందు తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో చర్ల మండల కమిటీ, గ్రామ కమిటీల నూతన కమిటీల ఎన్నికల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం కొప్పుల రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ద్రర దామోదర్ మాట్లాడుతూ వాడ బలిజ సంఘాన్ని బలోపేతం చేయాలని, మనమంతా ఆర్థికంగా, సామాజికంగా విద్య, వైద్యం రంగాల్లో వెనుకబడి ఉన్నామని, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వాడబలిజాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కుల సర్టిఫికెట్లు, మత్స్య సొసైటీలో ప్రాతినిధ్యం ఉండాలని, భవిష్యత్తు కర్తవ్యాలు నిర్ణయించుకుని వాడబలిజల అభివృద్ధిపై కార్యచరణపై చర్చించారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుండి వచ్చినటువంటి పెద్దలు, యువకుల సమక్షంలో చర్ల మండల కమిటీ, గ్రామ కమిటీలు ఎన్నుకున్నారు. చర్ల మండల అధ్యక్షులుగా ఎర్రావుల ప్రేమ్, ఉపాధ్యక్షులుగా బద్ది శ్రీనివాస్, కార్యదర్శిగా గగ్గూరి సాంబశివరావు, అధికార ప్రతినిధిగా ఎర్రం రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చింతూరి వెంకట్రావ్, ఉపాధ్యక్షులు గగ్గూరి రమణయ్య, అధికార ప్రతినిధులు చింతూరి వెంకట్రావ్, తోట మల్లికార్జున్‌రావు, చింతూరి గాంధీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోట ప్రశాంత్, ఉపాధ్యక్షులు బొల్లె నరేష్, వాజేడు మండల అధ్యక్షులు గార నాగార్జున్, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు సుగంధం రమేష్, ములుగు జిల్లా యూత్ అధ్యక్షులు వాదం సమ్మయ్య, తిరుపతి, కొప్పుల మహేష్, సంకపాప గణపతిపాల్గొన్నారు.

# ఆదర్శ మార్క్సిస్టు రామలింగయ్య



## - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



ప్రజాపక్షం/ చింతకాని : క్రమశిక్షణ, నీతినిజాయితీకి మారుపేరుగా నిలిచి తన జీవితాంతం పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు పోరాడిన మాదినేని రామలింగయ్య ఆదర్శ మార్క్సిస్టు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కొనియాడారు. కొదుమూరు మాజీ సర్పంచ్ మాదినేని రామలింగయ్య సంస్మరణసభ స్థానిక జ్యోతి ఫంక్షన్ హాల్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగింది. తొలుత రామలింగయ్య చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రామలింగయ్య కుమారుడు తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, సిపిఎం మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో తమ్మినేని మాట్లాడుతూ రామలింగయ్య బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటూ ప్రజాపోరాటాలు నిర్వహించారన్నారు. కొదుమూరు గ్రామంలో పార్టీ కోసం ఎన్ని ఒడిదొడుగులు ఎదురైనా నిబద్ధతగా నిలబడిన మహాసభావుడు అన్నారు. సిపిఎంలో ఉన్నప్పుడు అనేక బెదిరింపులు వచ్చినప్పటికీ ఆ బెదిరింపులకు భయపడకుండా పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం నిలబడి పోరాటాలు చేసి ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడన్నారు. రామలింగయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రజా పోరాటాలు నిర్వహించాలని అప్పుడే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. మాదినేని రామలింగయ్య విలువలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన వ్యక్తి అని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. రామలింగయ్య లాంటి వ్యక్తులు కమ్యూనిస్టు అరుదుగా ఉంటారని, అటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని యువతీ, యువకులు ప్రజాపోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈసభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.సాగర్, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఎం.సుబ్బారావు, సిపిఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, కూచిపూడి రవి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, కాసాని ఐలయ్య, చంద్రారెడ్డి, జంగారెడ్డి, వత్సవాయి జానకి రాములు, రాచబంటి రాము, రామలింగయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యలు పరిష్కరించండి



## రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్

ప్రజాపక్షం/ ఖమ్మం : ఫొటో, వీడియో గ్రాఫర్స్ సమస్యలు పరిష్కరించాలని షరతులు లేకుండా ప్రతి ఒక్కరికి రుణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ కార్యక్రమాల కవరేజీ విషయంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్‌కు అవకాశం కల్పించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పలువురు ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఆదుకోవడంతో పాటు సబ్సిడీ ద్వారా రుణాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక షాదీఖానాలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హుస్సేన్ మాట్లాడుతూ త్వరలోనే ఒక కార్యాచరణతో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఇండ్లు కూలిపోయి ఇబ్బందుల్లో ఉన్న దివంగత ఫొటో గ్రాఫర్ బానోత్ శ్రీను కుటుంబానికి అసోసియేషన్ తరుపున రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మారగాని వెంకట్, కె. అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సుధాకర్, ఖమ్మం పట్టణ అధ్యక్షులు రఘు, కార్యదర్శి రాజాబాబా, కోశాధికారి తిరుపతిరావు, ఉపాధ్యక్షులు లాస్య స్టూడియో ఆంజనేయులు, అఖిల్, కార్తీక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌డ్యాం నిర్మాణ పనులు ప్రారంభం



ప్రజాపక్షం-నేలకొండపల్లి : మండలంలోని కట్టుకాచారం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు సంబంధించి శనివారం ఇరిగేషన్ అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. మండలం లోని కట్టుకాచారం గ్రామంలో పాలేరు వాగు పై రూ..7.50 కోట్లతో నూతనంగా చెక్ డ్యామ్ నిర్మించనున్నారు. రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలు మేరకు శనివారం ఇరిగేషన్ ఏఈ టి.నరేష్ సర్వే పనులు ప్రారంభించారు. ఇటీవల మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్‌రెడ్డి కట్టుకాచారంలో వాగు ను పరిశీలించారు. చెక్ డ్యామ్ నిర్మించే స్థలం ను రైతుల అభిప్రాయాల మేరకు నిర్మించనున్నారు. ఈ మేరకు ఆ స్థలం వద్ద సర్వే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు భూక్యా చంద్రునాయక్ మాట్లాడారు....కట్టుకాచారం గ్రామాలతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలకు అనేక ప్రయోజనాలు చేకూరతాయని అన్నారు. చెక్ డ్యామ్ మంజూరు చేసిన మంత్రి శ్రీనివాసరెడ్డి కి రైతులు రుణపడి ఉంటారని అన్నారు. దాదాపు 200 ఎకరాల విస్తీరణం సాగులోకి రానున్నట్లు తెలిపారు. అంతే కాకుండా రైతులతో పాటు ప్రజలకు, మూగజీవాలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌రెడ్డి, రైతులు ఏటుకూరి పుల్లయ్య, బీ.సైదులు, కోటి అనిల్, పీరు, బోయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన మీటర్ల కొరకు మంత్రికి వినతి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : 15వ డివిజన్ పరిధిలో పలు విలీన గ్రామాలు ఉన్నాయని విలీన గ్రామ పంచాయితీల నివాసుల్లో కొంత మందికి రిజిస్ట్రేషన్ డాక్యూమెంట్లు లేక విద్యుత్ మీటర్లు ఇవ్వడం లేదని వారికి విద్యుత్ మీటర్లు మంజూరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ సమావేశానికి విచ్చేసిన మంత్రికి కరుణ 15వ డివిజన్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. 15వ డివిజన్ పరిధిలోని అల్లిపురం, కొత్తగూడెం, పుట్టకోట, రుద్రమ్మకోట గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని నీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఈ డివిజన్ పరిధిలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో



పాటు వీధీ దీపాల సౌకర్యం కల్పించాలని కరుణ మంత్రి తుమ్మలను కోరారు. ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

# ఖరీఫ్‌పై ఆశలు పెంచిన వర్షం

ప్రజాపక్షం/ ఖమ్మం : అల్పపీడన ద్రోణి కారణంగా ఉమ్మడి ఖమ్మంజిల్లాలో గడిచిన 24 గంటల్లో భారీ వర్షం కురిసింది. అల్పపీడన ద్రోణి కారణంగా ఖమ్మంజిల్లాలో భారీ వర్షం నమోదు కావడంతో వాగులు, వంకలు కొంత మేర జల కళను సంతరించుకున్నాయి. చిన్న చిన్న కుంటలు అలుగులు పోశాయి. ఇటీవల వరకు సరైన వర్షపాతం లేకపోవడంతో చెరువులు, కుంటల్లోకి కూడా నీరు చేరలేదు. వైరా నదికి కొత్త నీరు చేరడంతో పరవళ్లు తొక్కుతుంది. మున్నేటి పరివాహక ప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో మున్నేరు వెలవెలపోతుంది. జిల్లాలో అత్యధికంగా ఏన్కూరులో 51.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా చింతకానిలో 47.2, ముదిగొండలో 36.2, ఖమ్మంలో 36.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఏన్కూరులో వర్షపాతం నమోదు కాగా అతి తక్కువ వర్షపాతం మధిరలో 8.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

# అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

## మున్సిపల్ కమిషనర్‌కు వినతి

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం నగర పరిధిలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫోరం స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ కెవి కృష్ణారావు మాట్లాడుతూ వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని శ్రీనగర్ కాలనీ రోడ్డు నెం.15లో 3.10 ఎకరాలను చేకూరి పద్మ, సంధ్యారాణి లు 2011లో కొనుగోలు చేశారని చెబుతుండగా మరో వైపు మరి కొందరు ఆ భూమిలో బలవంతంగా ప్రవేశించి ఆ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారని దీనిపై అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదన్నారు. అధికారుల తీరు చూస్తుంటే దీని వెనుక కొంత మంది ప్రజాప్రతినిధులు ఉన్నట్లు అనుమానం కలుగుతుందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో చెరుకుపల్లి నాగేశ్వరరావు, ఉపేంద్ర, మిరియాల నాగరాజు, లాజర్, వరలక్ష్మి, బానోత్ భద్రునాయక్, హన్మంతరావు తదితరులు ఉన్నారు.

# గురుకులం వద్ద తల్లిదండ్రుల ఆందోళన



ప్రజాపక్షం/ వైరా : రెబ్బవరం గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాలయంలో వసతులు సక్రమంగా లేవని విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఆందోళన నిర్వహించారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని విద్యార్థుల సంఖ్యకు సరిపడ మరుగు దొడ్లు లేవని ఆరోపించారు. అధికారుల తీరును నిరసిస్తూ వైరా, మధిర ప్రధాన రహదారిపై బైఠాయించారు. రెండు గంటలకు పైగా ఆందోళన నిర్వహించడంతో ఇరు వైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సమస్యను పరిష్కరించక పోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.

# వైరా చెరువుకు కొత్త నీరు



ప్రజాపక్షం/ వైరా : అల్పపీడన ద్రోణి కారణంగా వైరా రిజర్వాయర్‌లోకి కొత్త నీరు చేరుతుంది. చెరువు ఎగువ భాగంలో భారీ వర్షం నమోదు కావడంతో శనివారం ఒక్క రోజే ఎనిమిది అంగుళాల నీటి మట్టం పెరిగి 7.6 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్ లో నీటి రాకతో రైతుల్లో ఆశలు పెంచుతుంది. నిన్న మొన్నటి వరకు చెరువు ఆయకట్టు పరిధిలో ఖరీఫ్ పై ఆశలు వదులుకున్నారు. వర్షాలు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

# యువకుడి ఆత్మహత్య

ప్రజాపక్షం/ చింతకాని : చింతకాని మండల పరిధిలోని నాగులవంచకు చెందిన నల్లమోతు విజయ్‌కుమార్(25) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్న విజయ్‌కుమార్‌ను మూడు నెలల క్రితం ఉద్యోగం నుంచి తొలగించారు. నాటి నుంచి నాగులవంచలోనే ఉంటున్నాడు. పలు సంస్థల్లో ఉద్యోగం పొందేందుకు దరఖాస్తు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఊరు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. గాంధీనగర్ సమీపంలో శుక్రవారం రాత్రి జిటి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ట్రాక్ సిబ్బంది మృతదేహాన్ని శుక్రవారం ఉదయం గుర్తించి జిఆర్‌పి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఛిద్రమైన మృతదేహాన్ని అన్నం సేవా సమితి బాధ్యుడు అన్నం శ్రీనివాసరావు బృందం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి నల్లమోతు మోహన్‌రావు ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.